# ౮

## తన దాకా వస్తే!

అభాండేశ్వర్రావుభార్య అపవాదమ్మ బిందె పుచ్చుకొని మంచినీళ్ల బావివద్దకు వెళ్లింది. అప్పటికే ఆవిడ స్నేహితురాలు ప్రచారిణమ్మ వచ్చి నీళ్లు తోడుకుంటోంది.

అపవాదమ్మ, "ఐతే, ఓవిడా, ఆఖరికి యీ అమాయకరావుగారు సాంప్రదాయమంతా చట్టబండలుచేసి ఇంగిలిపీసు చదువుకున్న ఆ దొరసాన్ని కోడలుగా చేసుకుంటాడన్నమాట!" అంది.

"అమాయకరా వేం చేస్తాడమ్మా? పెళ్లికొడుకే సుశీల చదువుకున్న పిల్లగదా అని మోజు పడుతున్నాట్ట!"

"చదువు! యెందుకమ్మా, చదువు?"

"ఎందుకేమిటి? చాకలిపద్దయినా రాసుకోవచ్చుని."

"చాకలిపద్దు గాదు, ప్రేమలేఖలు రాసుకోవచ్చు!"

"ఊళ్ళో సంబంధమే ఐతే యింక ప్రేమలేఖ లేం రాస్తుందమ్మా?"

"ఇహిహీ! మా ఆయన చెప్పినట్లు, మొగుడికే రాయాలని యెక్కడుందో ఓవిడా?"

"సుశీల గుణం మంచిది కాదన్నమాట! అయితే, ఆభాండేశ్వరం అన్నగారేమన్నా రేమిటి?"

"మన కెందుకు పోనిద్దూ? యెవళ్ళ పాపాన వాళ్లే పోతారు!"

"నాతో చెప్పటాని కేమమ్మా? నేనేం ఫరాయిదాన్నా?"

"అయితే విను. ఈ వగలమారి ఇస్కూల్లో మగపిల్లల కెంతమందికో ఉత్తరాలు రాస్తుందట!"

బిందెలు బుజాల కెత్తుకుని ఎవరిదారిని వారు వెళ్ళేరు. నీలాటిరేవులో పుట్టిన ఆ అభాండం మటుక్కి అక్కడ అంతరించక, నీటిమీద నూనెచుక్కలమల్లే ప్రచారిణమ్మ ధర్మమా అంటూ ఇట్టే వ్యాపించి, అగ్నిహోత్రంగారి సుశీలపెళ్లి అట్టే ఆగిపోయింది. "కారణాంతరాలవల్ల మీ సంబంధం మేం విరమించుకోవలసొచ్చింది. మీరు మరొక సంబంధం చూసుకోండి" అని అమాయకరావుగారు కబురుచేశారు. దానితో అగ్నిహోత్రంగారికి నడుం విరిగిపోయినట్లయింది.

## 2

ఆ వూళ్ళోనే ప్రతిష్ఠారావనే ఒక స్కూలుమేష్ట రున్నాడు. అతడు రావుసాహేబు అనుమానయ్యగారి వీధికొట్లో అద్దెకున్నాడు. ఇంకా వివాహంకాలే దతనికి. ఆ సంగతి తెలిసి ఎవరో కీర్తిపతి అన్న ఆయన వచ్చి అతనికి తన కూతుర్ని ఇస్తానన్నాడు.

ప్రతిష్ఠారావు వెళ్లి ఆ పిల్లని చూసి వచ్చాడు. అతగాడికి దగ్గిరబంధువు లెవరూ లేరు. రావుసాహేబుగారితో వివాహవిషయం సంప్రదించాడు. "పిల్ల నచ్చిందంటున్నావు గనక నిశ్చయంచేసుకో" అన్నా రాయన. తన సమ్మతిని తెలియపరుస్తో ప్రతిష్ఠారావు కీర్తిపతిగారికి జాబు రాశారు. మూహోర్నాటికి కీర్తిపతి తాంబూలా లివ్వటానికి వచ్చాడు. ఆయనకు బజార్లో వ్యాప్తిశర్మ యెదురై, "ఓహో, ఇలా దయచేశారే?" అన్నాడు. కీర్తిపతిగారికి శర్మముఖం యెక్కడో చూచినట్లే ఉందిగాని పూర్తిగా స్ఫురణకు రాలేదు. "ఏదో వ్యవహారంలో మీ గ్రామానికి వచ్చినప్పుడు ఒకపూట మీ యింట భోజనం చేశాను" అని జ్ఞాపకంచేశాడు శర్మ. "ఔను!" అని కీర్తిపతి పోబోతూంటే శర్మ వెంటబడి, ఆయనరాకకు కారణం అడిగి తెలుసుకున్నాడు.

"మీరుకూడా ఓ తాంబూలం పుచ్చుకుందురుగాని రండి" అని కీర్తిపతిచేత అనిపించుకుని, రావుసాహేబుగారింటికి తనుకూడా వెళ్లేడు. ఆ యింటి ప్రక్కదే పరోపకార పరాయణంగారి మేడ. పరాయణంగారినికూడా 'దయచెయ్య

వలసిం'దని పిలిచారు. అనుమానయ్యగారి రెండో పెళ్లి భార్య సరదాలమ్మ సరదాగా యింత టిఫినూ, కాఫీ తయారుచేసి యిచ్చింది. ప్రతిష్ఠారావుకి వెనకదక్షుత యెవరూ లేకపోయినా, ఆమె అలా పూనుకుని, ఆ వచ్చినవాళ్ళని ఆదరించటంవల్ల అతగాడి కామె వెయ్యిమంది చుట్టాల బలగ మనిపించింది.

వ్యాప్తిశర్మ టిఫిను తిని, కాఫీ తాగి త్రేన్చి, తాంబూలం పుచ్చుకొని, తనదారిని పోతూ మిత్రుడు అభాండేశ్వర్రావుని చూచిపోవాలనిపించి వాళ్లింట్లోకి వెళ్లేడు.

"ఏమిటోయ్ విశేషం? యెక్కణ్ణో తాంబూలం తెచ్చుకొచ్చావే?"

సంగతంతా చెప్పేడు శర్మ. ప్రసంగం సరదాలమ్మ మీాదికి మళ్లి, అభాండేశ్వరం నాలుక వీరవిహారం చేసింది.

కాఫీలూ, టిఫిన్లూ యిచ్చిందికదూ సరదాలమ్మ! ఎందుకివ్వదూ? ప్రతిష్ఠారావులాంటి బ్రహ్మచారి యెవరు దొరుకుతాడోయ్, దానికి?"

"అదా కథ? ఎందుకు చెప్మా, యింత బులబాటంగా ఉం దీవిడా అనుకున్నాను." అంటూ శర్మ అక్కడనుంచి వెళ్లి, ఆ కథకి కాళ్ళూ చేతులూ కల్పించి, వ్యాప్తిచేశాడు.

మరికొన్నాళ్ళకి రావుసాహేబు అనుమానయ్యగారింట్లోంచి దభీదభీమని గుద్దుల చప్పుడూ, సరదాలమ్మ యేడుపులూ పక్కనున్న పరోపకారపరాయణంగారింట వినపడేవి. "ఆయనకి యీా మధ్యనే తగిలిం దీ అనుమానం. ఇదివరలో దంపతు లిద్దరూ అన్యోన్యంగానే వుండేవారు. మరి

ఇంతకీ సరదాలమ్మ చాలా దొడ్డది'' అంది భర్తతో, పరాయణంగారి భార్య. ఆ సాయంత్రం బజార్లో ప్రతిష్ఠారావు యెదురయేసరికి పరాయణంగారు, ''మేష్టరుగారూ, మీరు మరోకలాగ భావించకపోతే నేనొక సలహా యివ్వాలి మీకు. ఏమిటంటారా? సాధ్యమైనంతత్వరలో మీరు మరోయింటికి మారటం మంచిది'' అన్నారు.

''మారేను బాబూ, మొన్న రాత్రికి రాత్రే మార్చేశాను.''

''అలాగా? నాకు తెలీదు.''

''అనుమానయ్యగారు వచ్చి, 'మాకు వీధికొట్టు అవసరంగా వుంది. మీరు వెంటనే ఖాళీచెయ్యాలి' అన్నారు. 'ఏమిటి చెప్మా, ఇంత అత్తాత్తుగా ఖాళీచెయ్యమంటున్నారు?' అని ఆశ్చర్యం వేసింది. కాని, కీర్తిపతిగారి జాబు చూడ్డంతోనే సంగతంతా తెలిసి గుండె బాదుకున్నాను. ఆయన నాకు పిల్లనివ్వడుట. ఇవ్వకపోతే పోనీండి కాని, నాకీ లేనిపోని అప్రతిష్ఠ ఏమిటి చెప్పండి?'' అని వాపోయి, ప్రతిష్ఠారావు వెళ్ళేడు.

## 3

అగ్నిహోత్రంగారికి సానుకూలమూర్తి అనే బావమరది వున్నాడు. అతడు మేనగోడలికి తిరిగిపోయిన పెళ్ళిసంబంధం సానుకూలపరచాలని శతవిధాల ప్రయత్నించాడు. పరోపకార పరాయణంగారిచేత చెప్పిస్తే, ఆ అమాయకరావుగారు వింటా

డేమో అనిపించి, అగ్నిహోత్రంగారిని వెంటబెట్టుకుని ఆయన వద్దకు వెళ్ళి సంగతంతా చెప్పేడు. "ఇది నీలాటిరేవులో పుట్టిన అభాండమేగాని ఇందులో యథార్థం ఏమీలేదని అమాయక రావుగారికి తమరు నచ్చచెప్పి, పుణ్యం కట్టుకోవాలి" అన్నాడు సానుకూల మూర్తి.

పరాయణంగారు, "మీ వెర్రిగాని, నేను చెప్పినంత మాత్రాన్ని ఆయనకు నచ్చుతుందనా? తేలు కుడితే ఎక్కిన విషంలాంటిదే అపవాదు విషంకూడాను. మందో మంత్రమో వేసి, దీన్నికూడా తరహాలమీదే దింపుకురావాలి...మన ఊరికి ఈ అభాండేశ్వరం, అపవాదమ్మా చీడపురుగుల్లా దాపురించారు. వీళ్ళకితోడు, ఆ ప్రచారిణమ్మా, వ్యాప్తిశర్మాను! ఆ సరనాలమ్మనిగురించి అవాకులూ, చెవాకులూ ఏవో పేలి వీళ్ళంతా ప్రతిష్ఠారావుగారి పెళ్ళిసంబంధం చెడకొట్టడమే కాకుండా, రావుసాహేబు అనుమానంగారి హృదయంలో చిచ్చుపుట్టించారు" అన్నారు పరాయణంగారు. అగ్నిహోత్రం గారు, "ఈ అపవాదమ్మ తనకు పెళ్ళీడుకొచ్చిన ఒక కుమార్తె ఉండికూడా మా పిల్లని గూర్చి ఎలాంటి అవాచ్యపు మాటలందో చూడండి!" అని కంట తడిబెట్టుకున్నారు.

ప్రతిష్ఠారావు అక్కడ లేకపోయినా, ఆనాడు బజార్లో తన కెదురైనప్పుడు అత డెంత ఖిన్నుడై వాపోయాడో పరాయణంగారికి కళ్ళకి కట్టినట్లే వుంది. ఆయన వున్నట్టుండి సానుకూలమూర్తితో, "మూర్తిగారూ, మనం బాగా ఆలోచించి, ఏదైనా ఒక ప్లాను వేసి ఈ అభాండేశ్వరరావుగాడి మురాకి

తగినశాస్తి చెయ్యాలండీ!'' అన్నారు. మూర్తి, ''చిత్తం. 'ఏకక్రియా ద్వ్యర్థకరీ' అన్నట్లు, వీళ్లకి బుద్ధిచెప్పడమే కాకుండా, వీళ్ళమూలాన తిరిగిపోతూన్న సంబంధాలూ, కూలిపోతూన్న సంసారాలూ నిలబెట్టాలండీ'' అన్నాడు.

# 4

రెండురోజులు గడిచాక సానుకూలమూర్తి అభాండేశ్వర్రావు ఇంటికి వెళ్ళి యెంతో ఆప్యాయంగా గంటసేపు పైగా మాట్లాడి చక్కా వెళ్ళేడు. వాళ్లు ఏమి మాట్లాడుకుంటూన్నదీ అపవాదమ్మగారు వింటూనే వుంది. మూర్తి వెళ్లటంతోనే, అభాండేశ్వరం భార్యతో, ''చూశావుటే? కల్యాణతార తోసుకొస్తే సంబంధాలు వాటంతటవే ఎలా వస్తాయో! మరీచిత్ర మేమిటంటే, ఏదో అల్లాటప్పాసంబంధం కాకుండా వెళ్ళి వెళ్ళి ఓ సంస్థానంలో పడుతోంది మనమ్మాయి!'' అన్నాడు.

''ఘటన అంటే ఇదేనండీ మరి!''

''పరోపకారపరాయణంగారు తక్కినవాళ్ళకు మల్లే కట్నాల ఆశ పెట్టుకోకుండా మన కులం, వంశం, సాంప్రదాయం ఇవన్నీ చూసి మోజుపడ్డారట!''

''ఆ అబ్బాయి మన అమ్మణ్ణిని ఎక్కడో చూసి మనసుపడి, దీన్నేగాని చేసుకోనంటున్నాట్టగా?''

''సానుకూలమూర్తి అలాగే చెప్పేడు. వియ్యపరాలు, 'ఊళ్ళోసంబంధం. పండుగపబ్బాలకి ఇట్టే వెళ్లివస్తూండొచ్చు. ఇంతకంటేనా?' అని మురిసిపోయిందిట...సరేగాని, 'రాజులు

నెయ్యిపోస్తానంటే కొంగుపట్టమన్నారు' గనక రేపే వెళ్ళి తాంబూలాలు ఇచ్చెయ్యి'' అన్నాడు మూర్తి.

''ఔను. 'శుభస్య శీఘ్రం' అని వూరికే అన్నారా పెద్దలు? రేపే వెడదాం.''

# 5

పరోపకారపరాయణంగారింటి హాల్లో ఒక్క స్త్రీను వుంది. ఆ తెరవెనకాల మూడు సోఫా లున్నాయి. అభాండేశ్వ రావూ, అపవాదమ్మా రాకపూర్వమే, అక్కడికి అమాయక రావూ, కీర్తిపతీ, రావుసాహేబు అనుమానంగారూ రప్పింప బడ్డారు. తాంబూలాలు ఇవ్వటానికని వస్తూన్న దంపతులు దూరాన కనపడ్డంతోనే సానుకూలమూర్తి అమాయకరావు వగైరాలను తెరవెనకాలకు తీసుకుపోయి సోఫాలలో కూర్చో బెట్టేడు. తనూ, పరోపకారంపరాయణంగారూ మటుకు హాల్లో మిగిలేరు. అభాండేశ్వరం గుమ్మం ఎక్కుతో హుషారుగా, ''బావగారూ, నమస్తే'' అన్నాడు. పరోపకారపరాయణంగారు మొహం ముడుచుకుని అయిష్టం ఉట్టిపడేటట్లు, ''అభాండేశ్వ రావుగారూ, మీచేత 'బావా' అని పిలిపించుకునే అవకాశం లేదని చెప్పటానికి నేను చాలా విచారిస్తున్నాను. వృథాగా శ్రమపడి మీరుఆడవారిని వెంటబెట్టుకునిఇక్కడిదాకా రానక్క ర్లేకుండానే కబురుచేయిద్దా మనుకుంటూంటే మీరే వచ్చే శారు'' అన్నాడు. అభాండేశ్వరానికి మీద పిడుగుపడ్డ ట్టయింది.

''ఏం? అదేమిటి? ఏమొచ్చింది?''

సానుకూలమూర్తి తాపీగా "జరిగిన సంగతేమిటంటే, ఈ ఉదయమే పరోపకారపరాయణంగారికి మీమీద ఎక్కడ నుంచో ఆకాశరామన్న ఉత్తరం ఒకటి వచ్చి వీరి మనస్సు విరిచేసిందండీ రావుగారూ" అన్నాడు.

"ఉత్తరమా? ఏ దుర్మార్గుడు రాశాడండీ నామీద?" అని అంటూ అభాండేశ్వరం వీధికేసి చూసేసరికి గుమ్మం ఎక్కుతూ వ్యాప్తిశర్మా, ప్రచారిణమ్మా కంటపడ్డారు. "వీరెందుకూ వస్తున్నారు?"

"వీరుఉభయులూకూడా మీకుటుంబానికి స్నేహితులే కదా అని నేనే ఆహ్వానం పంపేను. రానక్కర్లేదని వీరికూడా కబురుచేస్తే తీరిపోను...రండీ శర్మగారూ" అన్నారు పరోప కారపరాయణంగారు.

పరోపకారపరాయణంభార్య అక్కడ కనపడలేదు. ప్రచారిణమ్మను, అపవాదమ్మే రమ్మని, "ఏం జరిగిందో విన్నావా? మామీద ఎవరో తుంటరి వీరికి వుత్తరం రాశాట్ట!" అంది విచారం కనపరుస్తో.

"ఏమని రాశాడు?"

సానుకూలమూర్తి వెంటనే జేబులోంచి ఒక జాబు తీసి, "వినండి చదివేస్తా" అంటూ చదవటం ప్రారంభించాడు :

"శ్రీశ్రీ పరోపకారపరాయణంగారిదివ్యసముఖమునకు—మీరు వెళ్లి వెళ్లి రొచ్చులో కాలువేస్తున్నారేమిటి? ఆ అభాం తేశ్వరరావుకీ, ప్రచారిణమ్మకీ ఉన్న సంబంధం లోకవిదితమే కదా—"

ప్రచారిణమ్మ ఉగ్రురాలైంది. "ఆరి వీడిమొహం మండిపోనూ! మీ యింట పెళ్ళి ఐతే నామీద రాశాడేమిటి?"

సానుకూలమూర్తి తాపీగా, "చదవనివ్వండమ్మా. ఇదంతా వృత్తి అపవాదుకోసం యెవడో రాసిందికాని యిందులో నిజం వుందనా?" అని, "ఇంక అపవాదమ్మ మాట. ఆ వ్యాప్తిశర్మగాడు రోజూ ఆవిడింట్లోనే యెందుకు కనపడ తాడో అందరికీ తెలిసిందే!" అని చదివేసి, ఆగేడు. అపవాదమ్మ ఉబ్బెత్తుగా లేచి, రౌద్రంగా, "ఆరి వీడి చెయ్యి పడి పోనూ! సీతాదేవిలాంటిదాన్ని-నామీద యిలా రాస్తాడా?" అని కూలబడిపోయింది. సానుకూలమూర్తి తాపీగానే, "ఇది అంతా వట్టి అపవాదే అనీ, యిందులో రవంతకూడా సత్యం వుండదనీ నేను ఈ పరాయణంగారికి చెవి నిల్లుకట్టుకొని యిందాకట్నుంచీ పోరుతోనే వున్నానండీ. కాని ఆయన ససేమిరా అంటున్నారు" అన్నాడు.

పరాయణంగారు:- అనుమానం తగిలేక యెవరు చేసుకుంటారు మూర్తిగారూ? మాటవరసకి చెబుతున్నాను. మా పక్కింటి మేడలో ప్రతిష్ఠారావుపైన యిలాంటి అభాండమే పడి ఆయనపెళ్లి ఆగిపోయింది తెలుసా?

సానుకూలమూర్తి:- నిజమేలెండి. ఎక్కడిదాకానో యెందుకూ? మా మేనగోడలు సుశీలపెళ్లి ఆగిపోయిందికాదూ?

పరాయణం:- ఔనన్నట్లు.ఆ అమ్మాయి గుణం మంచిది కాదని పుట్టించారుటకదూ యెవళ్ళో?

సానుకూలమూర్తి:- ఎవళ్ళో కాదు. ఈ ప్రచారిణమ్మగారే అన్నారని విన్నాను.

ప్రచారిణమ్మ:- (కంగారుగా) అదేమిటండోయ్, నేనా అంట? నేనని యెవరు చెప్పేరు?

సానుకూలమూర్తి:- అమాయకరావుగారు చెప్పేరు. అయ్యా, రావుగారూ, తమ రొక్క పర్యాయం తెరలోంచి ఇలా దయచెయ్యాలి.

ప్రచారిణమ్మ:- (ఆశ్చర్యంగా) ఏమిటి? తెర వెనకాల కూచోబెట్టారా ఆయన్ని? ఎందుకూ ఈ నాటకం?

అమాయకరావు:-(ప్రవేశించి,కరుగ్గా)ఎందుకో తర్వాత తెలుస్తుందిగాని 'సుశీల గుణం మంచిదికాదు' అని ప్రచారం చేస్తనువ్వేకదూ?

ప్రచారిణమ్మ:- ఏమో. నాకేం తెలుసు? ఈ అపవాదమ్మగారన్నమాటే నేనన్నాను.

అపవాదమ్మ:- ఛా! నేనేమన్నాను? అందులో ఏ పాపం ఎరగని సుశీలనా అనటం? ఎదట సిద్ధంగా కనపడ్డానని నామీద తోసేస్తోం దీవిడ! ఎదురుగుండా ఉన్నమ్మని ఎన్నెమ్మ కొట్టిందిట!

ప్రచారిణమ్మః- చాలుచాలు. ఈ నంగనాచి కబుర్లకేం లే! ఇనుమునుగురించి అగ్గికి సమ్మెటపోటన్నట్లు నీ మూలాన్నే నే నపఖ్యాతి పాలయ్యాను.

వ్యాప్తిశర్మః- బాగాచెప్పేరు ప్రచారిణమ్మగారు. మీరాతే నాకూ పట్టింది.

పరాయణంః- నీకేం? తుమ్మదుకట్టలాగ బాగానే వున్నావు! నువ్వు వేసిన అభాండంమూలాన్ని మధ్య ఆ ప్రతిష్ఠారావు అప్రతిష్ఠపాలై, అతడి పెళ్లి ఆగిపోవటం, ఇక్కడ ఈ సరదాలమ్మగారి కాపరం కూలిపోవటం జరిగేయి.

వ్యాప్తిశర్మః- నే నేం ఎరగనండోయ్ ఇందులో. ఆ పుణ్యాత్మురాలు కాఫీకూడా ఇచ్చిందా నా‍డు నాకు. అలాంటి ఆవిడకు ఘాత తలపెడతానా? (నిర్ఘాంతపోతో) ఇదేమిటి ఈ తెరలోంచి ఎవరో వస్తున్నారే! కీర్తిపతిగారేనా?

కీర్తిపతిః- (ప్రవేశించి) ఔను. నేనే. ప్రతిష్ఠారావుకీ, ఆ పుణ్యాత్మురాలికీ పాపం అంటగడత తమరేనని ఈ సభ్యులకి తెలియపరుచుకోటానికి బయటికొస్తున్నాను.

వ్యాప్తిశర్మః- (మొహం మాడిపోయి) అభాండేశ్వరావుగా రన్నమాటే మీతో అన్నానుగాని, నేను చూశానా, పెట్టేనా? (కోపంగా) ఇందుకా బాబూ మీరంతా నన్ని క్కడికి రప్పిస్త? నేను పోతాను.

ప్రచారిణమ్మ:- నాకుమాత్రం ఏం పని ? నేనూ పోతాను.

పరాయణం:- మీరు ఉభయులూ కూడా వెళ్ళవచ్చునండీ అభాండేశ్వరరావుగారూ!

అభాండేశ్వరరావు:-(ఉడుకుబోతుతనం, దుఃఖం, కోపం ముంచెత్తుకురాగా) ఐతే, మమ్మల్ని పిలిచి యిలా అవమానించటానికేనా 'పెళ్లి' అని యింత నాటక మాడేరు!

పరాయణం:-(సీరియస్‌గా మొహం తగలేస్తోన్నట్లు) కాదు! నీ నోటివట్టం మూలాన కూలిపోతోన్న సంసారాలూ, బెడిసిపోతూన్న సంబంధాలూ నిలపెట్టటానికి! హి! మీకిది అవమానమైంది కదూ? తమదాకా వస్తే తెలిసొచ్చిందన్న మాట!